

జగనన్న కాలనీల్లో నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: జగనన్న హౌసింగ్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయించాలని నగర కమిషనర్ డాక్టర్ జె అరుణ హౌసింగ్, అమినిటీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం కమిషనర్ నగరపాలక పరిధిలోని అనుపల్లి హౌసింగ్ లేఔట్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా లేఔట్ లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం నగరంలోని డ్రైనేజీ వ్యవస్థను పర్యవేక్షించారు. 48వ వార్డులో విస్తృతంగా పరిశీలించారు. కాలువల్లో వ్యర్థాలను పూర్తిస్థాయిలో తొలగించడం, కల్వర్టు మరమ్మత్తులు, ఇతర పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మురుగు కాలువల్లో నీటి ప్రవాహం స్తంభించకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఒ డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్స్పెక్టర్ చిన్నయ్య పాల్గొన్నారు.

పీజీ పరీక్షల్లో మాస్ కాపీయింగ్

ఎస్వీయూ అధికారుల సాక్షిగా...

- గేటుకు తాళాలు వేసి మరీ చూసిరాత
- 'పాస్ గ్యారంటీ' పేరుతో వేలల్లో ఫీజులు

ప్రజాశక్తి - పుంగనూరు

పరీక్ష రాస్తున్న వారంతా పీజీ విద్యార్థులు.. పుస్తకాలు పెట్టుకుని మరీ చూసిరాసుకుంటున్నారు.. ఎస్వీయూ అధికారుల సాక్షిగా మాస్‌కాపీయింగ్ 'సూపర్'గా జరుగుతోంది. కాలేజీ యాజమాన్యం గేటుకు బీగాలు వేసి మరీ సహకరిస్తోంది.. ఇది మన ఉన్నత విద్యా విధానం.. 'పాస్ గ్యారంటీ' పేరుతో ఉన్నతాధికారులే మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్నారు. ఇదేమని మీడియా ప్రశ్నించగా 'మాకు ఎంపి అండదండలు పుష్కలంగా ఉన్నాయి.. ఏం చేసుకుంటారో చేసుకోండి' అని నిర్లక్ష్యంగా సమాధానమివ్వడం గమనార్హం.

ఒకటో తరగతో...రెండో తరగతో కాదు...భవిష్యత్తులో అధ్యాపకులు, ఉన్నతస్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దే పోస్టుగ్రాడ్యుయేట్ పరీక్షలను ఓ కాలేజీ యాజమాన్యం చూచిరాతగా మార్చేసింది. అభ్యర్థుల నుంచి పాస్ గ్యారంటీ అని రూ.వేలల్లో ఫీజులు వసూళ్లు చేసిన కాలేజీ యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా అభ్యర్థులను పరీక్షల్లో మాస్ కాపీయింగుకు పాల్పడేలా చేస్తోంది. రాయచోటికి చెందిన కొందరు వ్యక్తులు పట్టణంలోని కొత్తపేట క్రాస్ వద్ద ఉన్న హెచ్ఎం డిగ్రీ కళాశాలను నిర్వహిస్తున్నారు. అయితే ప్రస్తుతం పోస్టుగ్రాడ్యుయేట్ ఎంఎ, ఎంఎస్సీ ప్రథమ సంవత్సరం పరీక్షలను దూర విద్యా విధానం ద్వారా నిర్వహిస్తున్నారు. ఎస్వీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పరీక్షలు రాయిస్తున్నారు. వారం రోజులుగా ఈ పరీక్షలు జరుగుతున్నాయి. 200 మందికి గాను ప్రతి రోజూ 180మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. ఈ పరీక్షల నిర్వహణ చూస్తే తరగతి గదిలో విద్యార్థులు క్లాసులో ఉన్నట్లుగా ఉంది కానీ పరీక్షలు రాసే విధంగా కనబడడం లేదు. రెండు రోజుల్లో ఈ పరీక్షలు ముగియనున్నాయి. మాస్ కాపీయింగ్ జరుగుతున్న విషయం తెలుసుకున్న మీడియా అక్కడికి వెళ్లడంతో వారి బండారం బయటపడింది. గేటుకు రెండు వైపుల తాళాలు వేసి ఎవరిని లోపలికి రానివ్వకుండా గేటు వద్దే వారి అనుచరులను కాపలా పెట్టారు. రేకుల షెడ్డులో ఇరుకైన గదిలో సుమారు 45మంది 50మంది వరకు పరీక్షలు రాస్తున్నారు. పక్కపక్కనే బేబుల్లు ఇద్దరు, ముగ్గురు చొప్పున కూర్చోబెట్టి బుక్కులు ఇచ్చి మరీ రాయిస్తున్నారు. అక్కడికి వెళ్లిన మీడియాపై ప్రిన్సిపాల్ దురుసుగా ప్రవర్తించారు. 'మీ ఇష్టం వచ్చినట్లు రాసుకోండి. ఎలా మేనేజ్ చేసుకోవాలో నాకు తెలుసు' అంటూ మండిపడ్డారు. ఎంపీ మిథున్ రెడ్డి అండదండలు మాకు ఉన్నాయని, మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరని ధీమాగా సమాధానం ఇచ్చారు. అయితే ఈ పరీక్షలు ఎస్వీ యూనివర్సిటీ అధికారుల సమక్షంలో నిర్వహించాల్సి ఉండగా వారు ఎవరూ లేకపోగా 'స్థానిక' సిబ్బందే పరీక్షలు నిర్వహించడం శోచనీయం.



కళాశాల గేటుకు తాళాలు వేసి మరీ...

విద్యార్థుల భవితతో చెలగాటం

- మూడేళ్లుగా విడుదల కాని పరీక్షా ఫలితాలు
- పాఠాలు చెప్పడమూ మానేశారు
- ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాలలో దుస్థితి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాలలో అధికారులు విద్యార్థుల భవితతో చెలగాటం ఆడుతున్నారు. ఈ కళాశాలలో మూడేళ్లుగా పరీక్షా ఫలితాలు విడుదల చేయలేదు. చివరి సంవత్సరం విద్యార్థులకు పాఠాలు చెప్పడమూ మానేశారు. ఫలితంగా విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. ఇలా అయితే తమ భవిష్యత్తు ఏమిటని వారు ఆందోళన చెందుతున్నారు. ఇందుకు సంబంధించి వివరాలు పరిశీలిస్తే...

తిరుపతిలలో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాలకు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ కళాశాలలో విద్య అభ్యసిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని విద్యార్థుల నమ్మకం. ఇక్కడ విద్య అభ్యసించిన విద్యార్థులు చాలా మంది ఎంతో ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. అందుకే ఎంసెట్‌లో మంచి ర్యాంకులు తెచ్చుకునే విద్యార్థులు ఈ కళాశాలలో చేరుతుంటారు. రాష్ట్రం నలుమూలల నుంచి ఎంతో తెలివైన విద్యార్థులు ఇక్కడకు వస్తుంటారు. ఇందుకు కారణం ఈ కళాశాలపై ఉన్న నమ్మకం. అయితే ఇటీవల కాలంలో ఈ కళాశాల ప్రతిష్ట దిగజారి పోతోంది. అధికారుల తీరుతో నాక్ గ్రేడ్ కూడా దిగజారి పోయింది. ప్రతి నెలా రూ.లక్షలు వేతనాలు తీసుకునే ప్రొఫెసర్లు పాఠాలు చెప్పడం పూర్తిగా మానేశారు. కొవిడ్ కారణంగా దాదాపు రెండేళ్లు ఇంజనీరింగ్ విద్యార్థులకు పాఠాలు సక్రమంగా చెప్పలేదు. విద్యార్థులు విద్యా సంవత్సరం కోల్పోతారనే కారణంగా వరుసగా పరీక్షలు నిర్వహించారు. అయినా విద్యార్థులు ఎంతో శ్రమకు ఓర్చి పరీక్షలు రాశారు. కొవిడ్ తగ్గుముఖం పట్టిన తరువాత విద్యార్థులను కళాశాలకు రప్పించారు. విద్యార్థులు అందుబాటులో ఉన్నప్పటికీ సక్రమంగా పాఠాలు బోధించ లేదు.



ప్రొఫెసర్లకు తీరిక ఉన్నపుడు మాత్రమే తరగతులకు వస్తుంటారు. లేదంటే తమ సహాయకులను తరగతులకు పంపుతారు. మిగిలిన సందర్భాల్లో విద్యార్థులను గాలికి వదిలేయడం వీరి అలవాటు. పాఠాలు చెప్పక పోయినా పరీక్షలు మాత్రం యథాతథంగా నిర్వహిస్తూ ఉంటారు. ఈ కారణంగా సొంతంగా చదువుకుని పరీక్షలు రాయాల్సి వస్తోంది. ల్యాబ్ ల నిర్వహణ కూడా చాలా అధ్వానంగా ఉంది. ఇలా అయితే తమకు ప్రాక్టికల్ నాలెడ్జ్ ఎలా వస్తుందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయం కళాశాల వారికి తెలిసినా విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు.

రెండేళ్లుగా విడుదల చేయని పరీక్షా ఫలితాలు

తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయ ఇంజనీరింగ్ కళాశాలలో రెండేళ్లుగా పరీక్షా ఫలితాలు విడుదల చేయలేదు. ఇందుకు కారణం ఏమో అధికారులకే తెలియాలి. సాధారణంగా జేఎన్‌టీయూ పరిధిలో ఉన్న కళాశాలల విద్యార్థులకు సెమిస్టరు పరీక్షలు పూర్తి కాగానే నెల రోజుల వ్యవధిలోనే ఫలితాలు విడుదల చేస్తున్నారు. ఫలితాలు విడుదల చేశాకే వేరే సెమిస్టరు పరీక్షలు నిర్వహిస్తుంటారు. అయితే తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయ ఇంజనీరింగ్ కళాశాలలో మాత్రం ఫలితాలు విడుదల చేయకుండానే పరీక్షలు నిర్వహిస్తుంటారు. వీరి పరిస్థితి ఎలా ఉందంటే సెమిస్టరు పరీక్షా ఫలితాలు పక్కన పెడితే... మధ్యంతర (మిడ్) పరీక్ష ఫలితాలు కూడా మూడేళ్లుగా వీరు విడుదల చేయడం లేదు.

పాఠాలు బోధించకుండానే...

శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయ ఇంజనీరింగ్ కళాశాలలో గత నెలలో బీటెక్ చివరి సంవత్సర విద్యార్థులకు మొదటి సెమిస్టరు పరీక్షలు నిర్వహించారు. ఈ తరువాత ఆన్ లైన్ లో తరగతులు బోధిస్తామని విద్యార్థులకు చెప్పారు. తమ ప్రొఫెసర్ల మాట విద్యార్థులు నమ్మారు. అయితే నెల రోజులు దాటి పోయినా తరగతులు మాత్రం బోధించ లేదు. పాఠాలు చెప్పకుండానే ఈ నెల రెండవ వారంలో మధ్యంతర (మిడ్) పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు అతికష్టం మీద సిలబస్ తెలుసుకుని... వారే సొంతంగా చదువుకుని మిడ్ పరీక్షలు రాశారు. వీరికి మళ్లీ త్వరలో రెండవ మిడ్ పరీక్షలు నిర్వహించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పాఠాలు చెప్పకుండా... పాఠ్యాంశాలు తెలియకుండా తాము పరీక్షలు ఎలా రాయాలని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇంజనీరింగ్ కళాశాల అధికారులు ఇకనైనా స్పందించి పెండింగ్ లో ఉన్న పరీక్షా ఫలితాలు విడుదల చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. అదేవిధంగా విద్యార్థుల భవిష్యత్తు దష్టిలో పెట్టుకుని తరగతులు బోధించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

చదువుతోనే ఉన్నత లక్ష్యాలు సాధ్యం

సదుం ఉన్నత పాఠశాలలో ఎంపి మిథున్‌రెడ్డి

ప్రజాశక్తి - సోమల

'విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాన్ని చేరేందుకు కష్టమైనా ఇష్టంగా చదివి లక్ష్యాలను చేరుకోవాలని, పాఠశాలలో సౌకర్యాల కల్పన కోసం తనవంతు సాయం ఎపుడు అడిగినా చేస్తా' అని ఎంపి మిథున్‌రెడ్డి అన్నారు. సదుం గ్రామంలోని జడ్‌పి ఉన్నత పాఠశాలలో శుక్రవారం పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమానికి రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తన చిన్ననాటి జ్ఞాపకాలను చెప్పి విద్యార్థులను ఉత్తేజపరిచారు. విద్యార్థులు పై చదువులకు వెళ్లేందుకు తన సొంత ఖర్చుతో ఎపుడూ అందుబాటులో ఉంటానన్నారు. తన తండ్రి ఇదే పాఠశాలలో చదువుకున్నారని, నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన తాము ఏ విధంగా చదువుకుంటూ ఉన్నత శిఖరాలకు చేరామో విద్యార్థులకు వివరించారు. ఏడో తరగతి చదువుతున్న బి.ఆసిఫ్ స్కూల్ గేమ్స్‌లో రాష్ట్రస్థాయిలో వాలీబాల్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించడంతో ఎంపి మిథున్‌రెడ్డి చేతుల మీదుగా గోల్డ్‌మెడల్‌ను, ధృవపత్రాన్ని అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫజురుల్లాతో సమావేశమైన ఆయన సౌకర్యాలపై స్పందించారు. ఆరు కంప్యూటర్లు, క్రీడా సామాగ్రి వస్తువులను తన సొంత డబ్బుతో పాఠశాలకు పూర్తిస్థాయిలో అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి, జడ్పిటిసి సోమశేఖర రెడ్డి, ఎంపీపీ మల్లప్ప పాల్గొన్నారు.




ఆసిఫ్‌కు గోల్డ్ మెడల్ అందిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి

వైసిపిలో అంతర్మథనం

వెంకటగిరి ఎంఎల్‌ఎపై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అసెంబ్లీ నుంచి 'స్థానిక', 'పురపాలిక' ఎన్నికల వరకూ తిరుగులేని విజయాన్ని కైవసం చేసుకున్న వైసిపి ఇటీవల జరిగిన వైసిపి ఎన్నికల్లో కోలుకోలేని ఓటమిని చవిచూసింది. అన్ని ఎన్నికల్లానే సునాయాసంగా 'డబ్బు', 'సంక్షేమ పథకాలు' గెలిపిస్తాయని భావించిన ఆ పార్టీకి ఊహించనిరీతిలో ఎదురుదెబ్బ తగిలింది. దీంతో జిల్లాలో మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంపిలు, ఎంఎల్‌సిలు తలలు పట్టుకునే పరిస్థితి. ఏడాదిగా లేని సాధారణ ఎన్నికల్లో ఈ అపజయాన్ని ఎలా ఎదుర్కోవాలోనని అంతర్మథనం భావించింది. ఎంఎల్‌ఎ కోటాలో జరిగిన ఎంఎల్‌సి ఎన్నికల్లో ఊహించని రీతిలో క్రాస్ ఓటింగ్ జరిగి టిడిపి అభ్యర్థి పంచుమర్తి అనురాధ విజయాన్ని కైవసం చేసుకుంది. నలుగురు ఎంఎల్‌ఎలు క్రాస్ ఓటింగ్ చేశారని 'ఆపరేషన్'లో బయటపడడంతో వారిపై సస్పెన్షన్ వేటు వేసింది. ఇందులో తిరుపతి జిల్లా వెంకటగిరి ఎంఎల్‌ఎ ఆనం రాంనారాయణరెడ్డి ఉన్నారు. ఎప్పటినుంచో జిల్లాలో తిరుగుబాటు బావుటా ఎగురవేటు వేస్తున్న ఆయన ఈ ఎన్నికల్లో తన అసంతృప్తిని ఓటు రూపంలో వెళ్లగక్కడం గమనార్హం.



ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆనంతో సహా ముగ్గురిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ముగ్గురు ఎంపిలను, 13 మంది ఎంఎల్‌ఎలను భారీ మెజార్టీతో గెలిపించుకుని టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడుకు చుక్కలు చూపించారు. కుప్పంలోనూ మెజార్టీని తగ్గించడమే గాకుండా, మున్సిపల్ ఎన్నికల్లోనూ వైసిపి జెండా ఎగురవేశారు. బల్లి దుర్గాప్రసాద్ మృతితో తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నిక అనివార్యమయ్యింది. ఇందులోనూ పెద్దిరెడ్డి క్రియాశీలకంగా వ్యవహరించారు. పంచాయతీ, జడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లోనూ అత్యధికంగా ఏకగ్రీవానికి ప్రయత్నించారు. స్థానిక సంస్థల్లో వైసిపి విజయఢంకా మోగించింది. పట్టభద్రులు, టీచర్లు ఎంఎల్‌సి ఎన్నికల్లోనూ అదే ఒరవడిని కొనసాగించారు. దొంగ ఓట్లను సృష్టించారు. కోట్లల్లో ప్రలోభాలకు గురిచేశారు. పోలింగ్ రోజు రిగ్గింగ్‌కూ పాల్పడ్డారు. వైసిపి, పిడిఎఫ్ మధ్యే ఈ ఎన్నికల్లో పోటీ ఉంటుందని టిడిపి సైతం భావించింది. అయితే ఊహించని రీతిలో పట్టభద్రులు టిడిపికి అత్యధిక మెజార్టీని కట్టబెట్టారు. ఉపాధ్యాయ ఎంఎల్‌సిల్లోనూ అతి తక్కువ ఓట్లతో పీడిఎఫ్‌పై వైసిపి గట్టెక్కింది. ఇక ఎంఎల్‌ఎ ఎన్నికల్లోనూ క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన శాసనసభ్యుల్లో తిరుపతి జిల్లా వెంకటగిరి ఎంఎల్‌ఎ ఉండటం గమనార్హం.

పకడ్బందీగా టెన్త్ పరీక్షలు : కలెక్టర్

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా పదవతరగతి పబ్లిక్ పరీక్షలను నిర్వహించాలని కలెక్టర్ యం. హరి నారాయణన్ పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం చిత్తూరు నాగయ్య కళా క్షేత్రంలో పదవతరగతి పబ్లిక్ పరీక్షలు- 2023 నిర్వహణకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్, కాసోడియన్లతో పదవ తరగతి పరీక్షల నిర్వహణపై శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు- 2023 పకడ్బందీగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పూర్తి బాధ్యతతో అప్రమ త్తంగా పరీక్షలు నిర్వ హణ జరగాలన్నారు ఏప్రిల్ 3వ తేదీ నుండి 18వ తేదీ వరకు జరిగే పరీక్షలను సమర్థవంత నిర్వహణ కు సన్నద్ధం కావాలన్నారు. పరీక్ష కేంద్రంలో పూర్తి బాధ్యత చీఫ్ సూపరింటెండెంట్ దే నని తెలిపారు. రెవిన్యూ, పోలీసు శాఖల సమన్వయంతో విద్యాశాఖ పరీక్షల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లు చేయాలన్నారు. ఇన్విజిలేటర్లతో సహా ఏ విద్యార్థీ సెల్ ఫోను, ఇతర ఎలక్ట్రానిక్ పరికరం గాని పరీక్షా కేంద్రం లోనికి అనుమతి లేదని, ఈ విషయాన్ని ఖచ్చితం గా చీఫ్ సూపరింటెం డెంట్ లు పర్యవేక్షణ చేయాలన్నారు. డీఈఓ విజయేంద్ర రావు మాట్లాడుతూ పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు రిసోర్స్ పర్సన్స్ శిక్షణ తరగతుల ద్వారా అవగాహన పెంచుకొని, పరీక్షల ను సజావుగా నిర్వ హించేందుకు కషి చేయాలన్నారు. సమగ్ర శిక్ష ఏపీసి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు విద్యార్థులకు ఎంత ముఖ్యమైనవని, విద్యార్థులు ఎటు వంటి భయాందోళనలకు లోను కాకుండా పరీక్షా విధానంపై పూర్తి అవగాహన కల్పించాలనన్నారు. ఈ శిక్షణ కార్య క్రమంలో చిత్తూరు డివైఈఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



డ్రగ్స్‌తో మానసిక ఒత్తిడి: డిఆర్‌ఒ

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: డ్రగ్స్ ఉపయోగించడం వల్ల యువత మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి ఉంటుందని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.రాజశేఖర్ అన్నారు. శుక్రవారం ఉదయం డిఆర్‌ఒ సమావేశ హాలులో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సిపిఒ, డిఆర్‌డిఎ, డ్వామా, మెప్మా, విద్య, వైద్యం, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, స్త్రీ శిశు సంక్షేమం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. జిల్లాలో డ్రగ్స్ నిర్మూలనకు సంబంధిత శాఖలు తీసుకున్న యాక్షన్‌ప్లాన్, తీసుకున్న చర్యలపై చర్చించారు. డిఆర్‌ఒ మాట్లాడుతూ యువత దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని, అలాగాకుండా మాదకద్రవ్యాలకు బానిసలై వారి జీవితాలను చెడు మార్గంలోకి తీసుకెళ్లకూడదన్నారు. డ్రగ్స్ నుంచి యువతను కాపాడేందుకు అధికారులు, తల్లిదండ్రులు, ఎన్జీవోలు పనిచేయాలన్నారు. హైస్కూల్స్‌లోనూ, కళాశాలలోనూ అవగాహన కల్పించాలన్నారు. ముఖ్య కూడళ్లలో బ్యానర్లు, పోస్టర్లు, హోర్డింగులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా డ్రగ్స్ అమ్మకాలు జరుగుతున్నట్లు తెలిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 14500కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఒ ఉమాదేవి, డిఆర్‌డిఎ, మెప్మా, డ్వామా, ఐసిడిఎస్ పీడీలు తులసి, రాధమ్మ, గంగాభవాని, నాగశైలజ పాల్గొన్నారు.

రాణీమహల్‌కు పూర్వవైభవమే లక్ష్యం : డిఇఒ

ప్రజాశక్తి - కార్వేటినగరం: కార్వేటినగరం సంస్థానాధీశల రాచరిక కట్టడాల్లో ఒక్కటైన రాణీమహల్ (అద్దాలమేడ)కు రాష్ట్ర ప్రభుత్వం పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కషి చేస్తోందని జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్రరావు అన్నారు. రాష్ట్ర పురావస్తు శాఖ అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం డీఈవో విజయేంద్రరావు ఎంపీపీ లతబాలాజీతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవొ మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి రాణీ మహల్ అభివద్ధికి సీఎం వైఎస్ జగన్ మోహన్రెడ్డి దష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. సీఎం ఆదేశాల మేరకు రాష్ట్ర పురావస్తు శాఖ అధికారులు రాణిమహల్ యొక్క స్థితగతులను పరిశీలించి నివేదిక తయారు చేయాలని సూచించినట్లు డీఈవో పేర్కొన్నారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం రాణిమహల్‌కు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తోందని అన్నారు. అనంతరం రాణిమహల్ నిర్మాణాన్ని, అందులోని శిల్పకళలను పరిశీలించి సంతోషాన్ని వ్యక్తం చేశారు. డీఈవొ వెంట వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ ధనంజయవర్మ, ఆర్కేఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం వైవీ వసుమతీదేవి, ఎంపీడీవో మోహన మురళీ, కో ఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్ రెడ్డి, ఏఈ నాగభూషణం. సీఆర్పీ కార్తీకరాయన్ ఉన్నారు.



రాణీ మహల్‌ను పరిశీలిస్తున్న డీఈవో విజయేంద్రరావు

5న చలో ఢిల్లీ పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై సిఐటియు- రైతు సంఘం- వ్యవసాయ కార్మిక సంఘం- కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ శుక్రవారం చిత్తూరు సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేంద్రన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఓబుల్ రాజులు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దుర్మార్గంగా కార్మిక చట్టాలను మార్పు చేయడం, రైతులకు కనీసం మద్దతు ధర ప్రకటించకపోవడం, వ్యవసాయ కార్మికులకు ఉపాధి దెబ్బతీయడం లాంటి అనేక రకాల వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నదని, వీటిని వ్యతిరేకిస్తూ గల్లి నుంచి ఢిల్లీ వరకు విస్తృతమైన ప్రచారం చేసి లక్షలాది మందితో ఏప్రిల్ 5న ఢిల్లీలో కనివిని ఎరుగని రీతిలో భారీ స్థాయిలో ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా నుంచి నాలుగు సంఘాల ఆధ్వర్యంలో పట్టణాల్లోనూ, గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. అధిక సంఖ్యలో ఢిల్లీకి తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు పి. చైతన్య, ఉపాధ్యక్షులు వాడ గంగరాజు, గిరిధర్ గుప్తా ,జ్యోతిరావు తదితరులు పాల్గొన్నారు.



'స్థలం కబ్జా అవాస్తవం'

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్

దేవుని స్థలం , కబ్జాకు పాల్పడ్డానని తనపై చేసిన ఆరోపణలు అవాస్తమని రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగి చిత్తూరు రాంనగర్ కాలనీకి చెందిన అరుణ తెలిపారు. శుక్రవారం చిత్తూరు ప్రెస్ క్లబ్ నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాంనగర్ కాలనీకి చెందిన సుజాత, రాధా ,ఉమా, లలిత, మహేష్ ,దినేష్ వారి నుండి ఇంటి స్థలాన్ని కొనుగోలు చేశానని .. వీరందరూ ఒకే కుటుంబానికి చెందిన వారని తనకు రిజిస్ట్రేషన్ చేయించారని తెలిపారు. తాను కబ్జాకు పాల్పడ్డానని ...అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాని చెప్పడం లో వాస్తవం లేదని చెప్పారు.. చట్ట ప్రకారం రెవెన్యూ ,మున్సిపల్ అనుమతితో ఇల్లు కట్టుకోవడం జరిగిందని తెలియజేశారు .. అయితే తన పరువుకు భంగం కల్పించే విధంగా తనపై వారు తప్పుడు ఆరోపణలు చేశారని వారిపై చట్టపరమైన చర్యలకు న్యాయ పోరాటం చేస్తానని తెలిపారు.



క్షయ నిర్మూలన అందరి బాధ్యత

నగర మేయర్ అముద

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: క్షయ వ్యాధి నిర్మూలన మన అందరి బాధ్యతని చిత్తూరు నగరపాలక సంస్థ మేయర్ అముద పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక ప్రభుత్వ జిల్లా ప్రధాన ఆసుపత్రిలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రకాశం, జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి రవిరాజు, డిసిహెచ్ ఎస్ నాయక్, అరుణ కుమార్‌లతో కలిసి ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణ మన అందరి బాధ్యతని జిల్లాలో క్షయ వ్యాధి రోగులు లేకుండా వైద్యాధికారులు పని చేయాలన్నారు. క్షయ వ్యాధి బారిన పడ్డ రోగులు డాక్టర్లు ఇచ్చే మందులను సక్రమంగా వాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ప్రకాశం మాట్లాడుతూ క్షయ వ్యాధి ఒక అంటువ్యాదన్నారు. అధిక జనాభా కలిగిన, మురికివాడల్లో నివసించే వారికి ఈ వ్యాధి వస్తుందన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, దగ్గినప్పుడు గళ్ళతో పాటుగా రక్తం పడడం, తరుచుగా జ్వరం రావడం, ఛాతీలో నొప్పి, బరువు తగ్గడం, ఆకలి మందగించడం వంటివి లక్షణాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, అధికారులు, వైద్య సిబ్బంది నర్సింగ్ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సోమల: క్షయ వ్యాధిని అంతం చేద్దాం అన్న నినాదంతో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా శుక్రవారం సదుం, సోమల మండలాలల్లోని వైద్య సిబ్బంది ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వం పౌష్టికాహారానికి అందించే రూ.500 ల నగదును బ్యాంకు అకౌంట్ ద్వారా పొంది వ్యాధి నయం చేసుకోవచ్చు అని వైద్యులు తెలిపారు. వైద్యాధికారులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రొంపిచెర్ల: క్షయవ్యాధిని తరిమికొడదామని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు రాజా, దినేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీని నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ పార్వతమ్మ, ఎంఎల్‌హెచ్‌పి గీత, ఎఎన్‌ఎం వెంకటేశ్వరి, సుజాత, గాయత్రి, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న నగర మేయర్

కార్వేటినగరం: క్షయ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి భాగ్యలక్ష్మి అన్నారు. జాతీయ క్షయ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యులు మురళీకష్ణ, పాండియన్, మీనాక్షి, యూసఫ్, స్టాఫ్ నర్సులు, పారామెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రం: క్షయ వ్యాధి ప్రాణాంతకం వ్యాధి కాదు, బాధితులు అప్రమత్తంగా ఉండి వైద్య చేయించుకోవాలని వైద్య అధికారి మోహన్ కష్ణ తెలిపారు. శుక్రవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మండల కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. సిహెచ్ఒ జ్ఞాన శేఖర్, సూపర్‌వైజర్ సుశీల, మురళి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

యాదమరి: క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా టిబి అంతం మన పంతం అంటూ శుక్రవారం స్థానిక వైద్యాధికారి అనిల్ కుమార్ నాయక్, సిహెచ్ఒ లక్ష్మీనారాయణ లు సిబ్బందితో కలిసి సంత గేటు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చిత్తూరు పరదరామి అంతర్ రాష్ట్ర రహదారిపై మానవహారం చేపట్టారు. సూపర్‌వైజర్ నిర్మలమ్మ, ఎంఎల్ హెచ్‌పిలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రామకుప్పం: మండల పరిధిలోని విజలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. శుక్రవారం డాక్టర్ అల్తాఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి మానవ హారంగా ఏర్పడి క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ అసిస్టెంట్ బాలు, పుష్ప, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారు పాళ్యం: క్షయ వ్యాధి నిర్మూలన ప్రభుత్వ ధ్యేయమని ప్రధాన వైద్యులు విజయ కుమారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలో క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవ కార్యక్రమం జరిగింది. డాక్టర్లు శిరీష భారతి, ఐసిటిఎస్ కౌన్సిలర్ బాబు, టిబి సూపర్‌వైజర్ శివకుమార్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నగరి: క్షయ వ్యాధిని పూర్తిగా నివారిద్దాం అని ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బాలకష్ణ నాయక్ అన్నారు. శుక్రవారం జాతీయ క్షయ నిర్మూలన దినోత్సవం సందర్భంగా టీబీ యూనిట్ ఏరియా హాస్పిటల్ నగరిలో టీబీ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. వైద్యులు కార్తికేయన్, ప్రవీణ, అంబిక, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సైరన్ ప్రారంభం



ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: స్థానిక శేషపీరన్ మసీదులో శుక్రవారం ఇఫ్తార్ సమయంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కే.చిన్నా రెడ్డి సైరన్ ప్రారంభించారు. రోజా (ఒక్క పొద్దు) ఉన్న ముస్లిం సోదరుల కోసం ఉదయం సహరి సమయంలో మేల్కొల్పడానికి, సాయంత్రం ఇఫ్తార్ సమయాన్ని తెలపడానికి సైరన్ వినియోగిస్తారు. సైరన్ ప్రారంభించిన అనంతరం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మసీదు కార్యదర్శి అఫ్జల్ ఖాన్, మసీదు సభ్యులు అబ్బాస్, అల్లావుద్దీన్, ఇలియాస్, ఇమామ్ అబ్దుల్ సుకూర్, జాతీయ మైనార్టీస్ కమిషన్ సలహాదారులు యం. అర్షద్ ఆయుబ్ ఖాన్, పి ఆర్ పి యు స్టేట్ ప్రెసిడెంట్ గిరి ప్రసాద్ రెడ్డి, వైయస్సార్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు గోవిందస్వామి పాల్గొన్నారు.

ఉర్దూ మీడియం విద్యాసంస్థల పని వేళల్లో మార్పు

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: రంజాన్ పండగను పురస్కరించుకొని ఉర్దూ ప్రాథమిక, ప్రాథమికోన్నత, డైట్ కళాశాల పని వేళలు మార్పు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి విజయేంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు ఉర్దూ మాధ్యమ విద్యా సంస్థలు ఈనెల 24వ తేది ఉదయం 8 గంటల నుండీ మధ్యాహ్నం 1-30 గంటల వరకు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షల నిర్వహణలో ఎలాంటి మార్పు ఉండదని తెలిపారు.

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రజాశక్తి-యాదమరి: స్థానిక యుటిఎఫ్ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. మండలం యుటిఎఫ్ సంఘం గౌరవ అధ్యక్షులుగా వై.ఆర్ కృష్ణయ్య, అధ్యక్షులుగా ఎంఎన్ శేఖర్, అసోసియేటెడ్ ప్రెసిడెంట్ ఎం సోమశేఖర్, అసోసియేట్ ప్రెసిడెంట్ 2 లతా రాసి, ప్రధాన కార్యదర్శి పంటపల్లి సురేష్, ట్రెజరర్ డిజి గిరిబాబు, మండల కార్యదర్శులు ఎ మూర్తి, ఎన్ లోకేశ్వరి, బి రజినీ దేవి, మల్లికార్జున, కే పుష్పలత, టి జానకి, ఆడిట్ కమిటీ కన్వీనర్ సి. తులసి, మునయ్య, సభ్యులు టి.హేమ సుందర్ రెడ్డి, లీలావతి, సి రాధిక, ఎస్ శశికళ, అకడమిక్ కమిటీ సభ్యులు జే సురేఖ, శోభా, ధనమ్మ, ఎస్ లక్ష్మి, సిపిఎస్ కన్వీనర్ కే షణ్ముగం, జిల్లా కౌన్సిలర్లుగా రహనా బేగం, ఎం సురేష్ కుమార్, ఎన్ రమేష్ ఎన్నికయ్యారు. ఎన్నికైన వీరందరికీ యాదమరి మండలం యుటిఎఫ్ శాఖ తరపున హార్థిక శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుల నిరసన




ప్రజాశక్తి-నగరి: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి రెండు సంవత్సరాలు జైలు శిక్ష విధించడంపై ఆ పార్టీ నాయకులు టవర్ క్లాక్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్లా పిచ్చి ఆధ్వర్యంలో టవర్‌క్లాక్ సెంటర్‌కు చేరుకున్న పార్టీ నాయకులు కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాన మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాహుల్ గాంధీ పై కేంద్ర ప్రభుత్వం తప్పుడు పరువు నష్టం కేసు బనాయించి రెండు సంవత్సరాల జైలు శిక్ష విధించిందని ఈ చర్యను ఖండిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఏఐసీసీ మెంబర్ భాను మూర్తి మాట్లాడుతూ బీజేపీ అక్రమ రాజకీయాలకు చరమ గీతం పాడే రోజులు దగ్గర పడ్డాయన్నారు. మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ బాబు, నాయకులు చిరంజీవిరెడ్డి, డిల్లి, దేశయ్య, గుణశేఖర్, దేశప్పన్ తదితరులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం



ప్రజాశక్తి-సోమల: మండలంలో శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో ఒక్కసారిగా వడగళ్లతో కూడిన భారీ వర్షం కారణంగా పలు ప్రాంతాలలో భారీ వృక్షాల కొమ్మలు విరిగి, విద్యుత్ స్తంభాలు నేలకు ఒరిగాయి. 81 చిన్న ఉప్పరపల్లి, నంజంపేట, సోమల పంచాయతీలలో వడగళ్లతో కూడిన వర్షం కురిసింది. దీంతో శీలం వారి పల్లి సమీపంలో చింత చెట్టు కొమ్మలు గాలి బీభత్సానికి రోడ్డుపై వొరగడంతో రాకపోకలు స్తంభించాయి. విద్యుత్ స్తంభాలు కూడా నేలకూలాయని గ్రామస్తులు తెలిపారు. అకాల వర్షం కారణంగా రైతులు ,కూలీలు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



బైరెడ్డిపల్లి: మండలంలోని కడపనత్తం గ్రామ సమీపంలోని హుస్సేన్ మటన్ షాపు శుక్రవారం గాలివాన బీభత్సానికి షాపు పైకప్పు సుమారు 200 మీటర్లు దూరంలో వెంగం వారి పల్లి జాతీయ రహదారిపై పడింది. కడప నత్తం గ్రామస్తులు ఈ ప్రమాదం జరిగినప్పుడు రహదారిలో బాటసారిలు గాని, ద్విచక్ర వాహనాలు గాని వెళ్లి ఉంటే పరిస్థితి ఏమిటి అని ముక్కున వేలేసుకుంటున్నారు. ఆ గ్రామంలోని నలగుంద్రాయ స్వామి ఆశీస్సులతోనే ప్రమాదం తప్పిందని గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని నియోజకవర్గ టీడీపీ కో ఆర్డినేటర్ భీమనేని చిట్టిబాబు నాయుడు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి పోటీ చేసిన నాలుగు స్థానాల్లోనూ విజయం సాధించడంతో నియోజకవర్గ టీడీపీ కో ఆర్డినేటర్ ఆధ్వర్యంలో గంగాధరనెల్లూరులో భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ కార్యాలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు టిడిపి నేతలు ర్యాలీ నిర్వహించి, టపాసులు కాల్చి స్వీట్ లు పంచి పెట్టారు. టిడిపి మండల అధ్యక్షులు స్వామిదాస్, లోకనాథ రెడ్డి, రాజేంద్ర, జయశంకర్ నాయుడు , చెంగల్రాయ యాదవ్, రుద్రయ్య నాయుడు, టిడిపి నేతలు వెంకటేష్, దేవసుందరం, తలారి రెడ్డప్ప, గుండయ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న స్వచ్ఛ సంకల్పంపై రెండు రోజుల శిక్షణ

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమల, మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు పంచాయతీలకు చెందిన సర్పంచ్, సచివాలయ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు, అగ్రికల్చరల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పారిశుద్ధ్య కార్మికులు రెండు రోజుల శిక్షణ తరగతుల కోసం పుంగనూరు మండలం చంద్రమాకుల పల్లె పంచాయతీలో హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా తడి, పొడి చెత్త వేరు చేసే విధానం, వర్మీ కంపోస్ట్ తయారీ తదితర అంశాలలో చంద్రమాకుల పల్లె వినూత్న పద్ధతులతో ముందుకు పోతోందన్నారు.

చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని.. జిల్లాలో చిరు ధాన్యాల సాగును ప్రోత్సహించాలని జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లావ్యవసాయ సలహా మండలి సమావేశం ఛైర్మన్ పి. రామచంద్రా రెడ్డి ఆధ్వర్యంలో... జడ్పీ ఛైర్మన్, జిల్లా జాయింట్ కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని రైతు ఇంటి ముంగిటకే సేవలను అందించేందుకు రైతు భరోసా కేంద్రాలను తీసుకురావడంతో పాటు రైతులకు అవసరమైన సేవలు అందించడం జరుగుతున్నదన్నారు. జిల్లాలో చిరుధాన్యాల సాధన ప్రోత్సహించాలని తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మామిడి పంటసాగు, దిగుబడి సంబంధింత అంశాలపై రైతులు దష్టి పెట్టే విధంగా అధికారులు అవగాహన కల్పించాలని, అదేవిధంగా పంట మార్పిడికి సంబంధించి మామిడి పంటలతో పాటు రాగులు, సజ్జలు, ఇతర చిరు ధాన్యాల పంటలను సాగు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గత వారం నుంచి కురుస్తున్న వర్షాల్లో కొన్ని ప్రాంతాలలో వడగండ్ల వానతో జరిగిన పంట నష్టం అంచనా వేసి నివేదికను ప్రభుత్వానికి నివేదించామన్నారు. వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ మాట్లాడుతూ ఇప్పటివరకు సుమారు 13 లక్షలకు పైగా మామిడి కాయలకు కవర్లు మంజూరు చేయడం జరిగిందని, ఇంకనూ కవర్లు కావాల్సిన వారు ఆయా రైతు భరోసా కేంద్రాలలో సంప్రదించాలన్నారు. జిల్లాలో మామిడి పంట దిగుబడిని అంచనాలు తయారు చేసి అంచనాలకు అనుగుణంగా ఉన్న ఫ్యాక్టరీలను దష్టిలో పెట్టుకొని మామిడి పంటను కోతలు కోయడంతో పాటు గిట్టుబాటు ధర వచ్చే విధంగా ప్రయత్నం చేస్తామని ఉద్యానవన అధికారి మధుసూదన్ రెడ్డి వివరించారు. వేసవి దష్ట్యా టాన్సార్మర్లు కాలి పోయిన సందర్భాల్లో రైతులు ఇబ్బంది పడకుండా 24 గంటలలో రీప్లేస్ చేయడం జరుగు తుందని విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీహరి తెలిపారు. ఈ సందర్భంగా సభ్యుడు సుధీర్ రెడ్డి మాట్లాడుతూమామిడి ఉత్పత్తులకు సంబంధించి సీజన్ ప్రారంభం కానున్నదని అయితే సీజన్ కు ముందే తూనికలు కొలతల కు సంబంధించినయంత్రాలను అధికారులు తనిఖీ చేసి రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా ఉండే విధంగాచూడాలన్నారు. ప్రకతి వ్యవసాయం ద్వారా ఉలవలు పెసలు అనుములు కొర్రలు,సాములు వంటి పంటలు వేసేలా చూడాలని ప్రధానంగా అంతర్ జూన్ నెలలో మామిడి లో వేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయని ఆ విధంగా రైతులకు అవగాహన కల్పిస్తు న్నామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకష్ణ వివరించారు. ఐక్యరాజ్యసమితి ఈ సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరముగా గుర్తించినందున వాటికి సంబంధం చిన రీసెర్చ్ స్టేషన్ ఏర్పాటు చేసి మరింతగా ఉత్పత్తి చేసేలా చూడాలని సభ్యుడు గోవర్ధన్ బాబి తెలిపారు. ఈ సమావేశంలో డిఎం సివిల్ సప్లై మోహన్ బాబు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ శేషగిరిరావు, ఫిషరీష్ అధికారి రవికుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మూడో విడత వైఎస్ఆర్ ఆసరా నిధులు విడుదల



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: స్వయం సహాయ సంఘాల బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను వైఎస్ఆర్ సర్కార్ విడతల వారిగా మాఫీ చేసేలా వైఎస్ఆర్ ఆసరా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. 2019 ఏప్రిల్ 11 ముందు స్వయం సహాయక సంఘాలు బ్యాంకుల్లో తీసుకున్న రుణాన్ని నాలుగు విడతల్లో ప్రభుత్వం మాఫీ చేస్తోంది. జిల్లాలో ఇప్పటి వరకు వై.యస్.ఆర్ ఆసరా మొదటి విడత ద్వారా 39,732 మంది లబ్దిదారులకు రూ.39.38 కోట్లు, రెండవ విడతలో 40,675 మంది లబ్దిదారులకు రూ.41.95 కోట్లు స్వయం సహాయక సంఘాల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. మూడో విడత వైఎస్ఆర్ ఆసర జిల్లాలోని 39, 842 స్వయం సహాయ సంఘాల్లోని పొదుపు మహిళల ఖాతాల్లో రూ. 40.28 కోట్లు జమకానున్నాయి. రాష్ట్రా వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శనివారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి ప్రారంభించనున్నారు. జిల్లాల వారిగా స్వయం సహాయ సంఘాల మహిళల ఖాతాల్లో మూడో విడత ఆసరా డబ్బులు జమకానున్నాయి. డిబిటి పద్ధతి ద్వారా కంప్యూటర్ బటన్ నొక్కి ఎస్ హెచ్ జి మహిళా లబ్దిదారుల పొదుపు ఖాతాలకు నేరుగా నగదు జమ కానున్నాయి.

జిల్లా స్థాయిలో స్థానిక అంబేద్కర్ భవన్ లో శనివారం ఉదయం 10-30 గంటలకు వైఎస్ఆర్ ఆసరా నిధుల విడుదల కార్యక్రమంలో మంత్రులు నారాయణస్వామి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కే రోజా, ఎంపిలు మిథున్‌రెడ్డి, రెడ్డప్ప, జెడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు వైఎస్ఆర్ ఆసరా నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొన్నారు. వైఎస్ఆర్ ఆసరా నిధులు స్వయం సహాయ సంఘాల మహిళల ఖాతాల్లో శనివారం నుండి ఏప్రిల్ ఐదో తేదీ వరకు జమకానున్నాయి.

నియోజకవర్గాల వారీగా ఇలా...

3 వ విడత వై.యస్.ఆర్ ఆసరా క్రింద జిల్లాలోని 4 నియోజకవర్గాలలోని 39,842 మంది సభ్యుల ఖాతాలకు రూ.40.28 జమ కానున్నాయి. చిత్తూరు నియోజకవర్గంలోని 18,890 మంది స్వయం సహాయక సంఘాల మహిళా లబ్దిదారులకు రూ.18.83 కోట్లు, నగరి నియోజకవర్గం లోని 7,869 మంది స్వయం సహాయక సంఘాల మహిళా లబ్దిదారులకు రూ.8.01 కోట్లు, పలమనేరు నియోజకవర్గంలోని 6,732 మంది స్వయం సహాయక సంఘాల మహిళా లబ్దిదారులకు రూ.7.71 కోట్లు, పుంగనూరు నియోజకవర్గంలోని 6,351 మంది స్వయం సహాయక సంఘాల మహిళా లబ్దిదారులకు రూ.5.73 కోట్ల నగదు జమ చేయనున్నారు.

రూ.165 కోట్ల పెట్టుబడితో ఫెర్రో అల్లాయ్ పరిశ్రమ ఏర్పాటు



ప్రజాశక్తి-పుంగనూరు: రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివద్ధి చేసే దిశలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వైజాగ్‌లో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో భాగంగా అనేక పరిశ్రమలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయని, ఇందులో భాగంగా ఇంధన శాఖకు సంబంధించి రూ.9 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంఒయు లు చేసినట్లు రాష్ట్ర విద్యుత్ అటవీ పర్యావరణ శాస్త్ర సాంకేతిక భూగర్భగనుల శాఖ మాత్యులు పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి తెలిపారు. శుక్రవారం పుంగనూరు మండలం ఆరడిగుంటలో రూ.165 కోట్ల పెట్టుబడితో ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ కంపెనీ వారిచే ఫెర్రో అల్లాయ్స్ ప్లాంట్ కు రాజంపేట పార్లమెంటు సభ్యులు, లోక్ సభ ప్యానల్ స్పీకర్ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, చిత్తూరు పార్లమెంటు సభ్యులు ఎన్ రెడ్డప్ప, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ యం హరినారాయణన్‌లతో కలిసి మంత్రి భూమి పూజ నిర్వహించారు. ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ కంపెనీ పరిశ్రమకు సంబంధించి యండి ఉమాంగ్ కేజ్రీవాల్, డైరెక్టర్ ప్రియ మంజరి తోడి, సిఇఒ ఎస్ఎన్ గోస్వామి, సిఒఓ సురేష్ ఖండేల్ వాల్, సీనియర్ విసిఒ ఎం ఆర్ రాజు ప్రకాష్, విపి మురళి మోహన్ బాబు, సీనియర్ జిఎం దొరై రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ మార్చి 3, 4 వ తేదీల్లో విశాఖపట్నంలో ముఖ్యమంత్రి ద్వారా గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహించారు. దీని ద్వారా దాదాపు రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు మన రాష్ట్రానికి వచ్చేలా ఎంఒయు లు కుదుర్చుకున్నారని తెలిపారు. ఇందులో దాదాపు రూ.9 లక్షల కోట్లు ఇంధనశాఖకు సంబంధించినవని తెలిపారు. ఈ కార్యక్రమానికి టిటిడి బోర్డు మెంబర్ పోకల అశోక్ కుమార్, రాష్ట్ర జానపద కళల అభివద్ధికార్పొరేషన్ ఛైర్మన్ కొండవీటి నాగ భూషణం, పలమనేరు కుప్పం మదనపల్లి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ వెంకట్ రెడ్డియాదవ్, పలమనేరు,కుప్పం ఆర్ డి ఓ శివయ్య, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలే విద్యార్థుల లక్ష్యం కావాలి

ప్రజాశక్తి-వి.కోట: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలే లక్ష్యంగా ముందుకెళ్లాలని ఎంపిపి యువరాజ్ 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో విద్యార్థులకు సూచించారు. మండల పరిధిలోని చింతమాకులపల్లి పంచాయతీ పసలమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో శుక్రవారం నిర్వహించిన 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తల్లి దండ్రుల కష్టాలను గుర్తించి తమ భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలన్నారు. సర్పంచ్ రామచంద్రప్ప, మాజీ సర్పంచ్ ఉమాపతి, పాఠశాల ఛైర్మన్ జయప్ప, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలి

ప్రజాశక్తి-కార్వేటినగరం: విద్యార్థులు చిన్న తనం నుంచే సామాజిక సేవా కార్యక్రమాలపై ఆశక్తి పెంచుకుని, సేవా దక్పథాన్ని అలవర్చుకోవాలని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సుద్దగుంట గ్రామంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులకు గ్రామాలలో వ్యక్తిగత శుభ్రత పాటించాలని, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ప్రజలలో చైతన్యం వస్తుందన్నారు. ఎంపీడీఓ మోహన మురళీ, మండల కన్వీనర్ ధనంజయవర్మ, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం న్యామతుల్లా, డిగ్రీకళాశాల అధ్యాపకులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

టర్నోవర్‌లో చిత్తూరు డిసిసిబి ముందంజ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జిల్లా వ్యాప్తంగా 43 బ్రాంచుల్లో డిసిసిబి బ్యాంక్ బంగారంపై రుణాలు అందిస్తోందని ఆ బ్యాంక్ ఛైర్మన్ రెడ్డమ్మ తెలిపారు. శుక్రవారం సర్వసభ్య సమావేశం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ సెంట్రల్ బ్యాంక్ రూ.2,500 కోట్ల టర్నోవర్‌తో ముందంజలో ఉండడం హర్షనీయమన్నారు.

సంఘమిత్రను తొలగించాలి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని తిప్పి నాయుడు పల్లి గ్రామపంచాయతీ, తిప్పి నాయుడు పల్లి సంఘమిత్రను తొలగించాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి యుగంధర్ పొన్న, ఎంపీడీఓ సుధాకర్ రావు స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మీడియాతో వారు మాట్లాడుతూ తండ్రి ఎంపిటిసి, తన కుమార్తె విద్యనభ్యసిస్తూ సంఘమిత్ర ఉద్యోగం ఎలా చేస్తుందని ప్రశ్నించారు. వారంలోపు ఉద్యోగం నుంచి తొలగించకపోతే జనసేన ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తామని తెలిపారు.

ఉన్నత పాఠశాలల్లో వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని సోమల, నంజంపేట, పెద్ద ఉప్పరపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం పాఠశాలల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం, వార్షికోత్సవ వేడుకలలో భాగంగా మొదటగా సరస్వతీ పూజ ఆపై విద్యార్థులకు విలువైన మాటలను సభ ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేశారు.

నగరి: స్థానిక జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదవతరగతి విద్యార్థులకు విద్యాసంవత్సరం పూర్తయి పరీక్షలకు హాజరుకావడానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో వారికి వీడ్కోలు సమావేశం, సరస్వతి పూజ కార్యక్రమాలను పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ కవిత, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుప్పరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెదురుకుప్పం ఎంపీటీసీ ఎన్. రాధిక పురంధర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా సరస్వతి పూజ నిర్వహించారు. ఎస్ఎల్టీఏ జిల్లా అధ్యక్షుడు దొడ్డ ఉమామహేశ్వర్ రావు, శ్యామల, కమలనాభన్, పుత్తూరు మురళీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రధానోపాధ్యాయులు హైమావతి అన్నారు. శుక్రవారం రొంపిచెర్ల మండలం, బొమ్మయ్యగారి పల్లి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హఫీజుల్లా, రమేష్, శ్రీనివాసులు, జాఫర్ బాషా, ప్రకాష్, సురేంద్ర రెడ్డి, నారాయణ, రంగారెడ్డి, కల్యాణి, విద్యార్థుల

పలమనేరు: పెంగరగుంటలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మండల విద్యాశాఖాధికారిణి పి.లీలా రాణి మాట్లాడుతూ 11 పేపర్లుకు బదులు 7 పేపర్ల విధానం ఈ సంవత్సరం అమల్లో ఉందని ప్రతి పేపరు విలువైందని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలసుబ్రమణ్యం, సిఆర్‌పిలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: స్థానిక మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కె విశ్వనాథ్ అధ్యక్షతన శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా పురోహితులచే శ్రీ సరస్వతి పూజ నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు

బంగారుపాళ్యం: ఉత్తమ ఫలితాల సాధన దిశగానే విద్యను అభ్యసించాలని ప్రధానోపాధ్యాయులు లలిత అన్నారు. శుక్రవారం మండలంలోని మంగళపల్లి, టేకుమంద, గుండ్లకట్ట, మంచి బోడబండ్ల, తంబు గాని పల్లి, పిడిబికండిగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వార్షికోత్సవ కార్యక్రమం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-గుడిపల్లి: మండలంలోని కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయంలో 2023-2024 సంవత్సరానికి గాను ఆరవ తరగతిలో 40 సీట్లు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎంఇసి గ్రూప్‌నకు 40 సీట్ల ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ మాధవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఉందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోదలచిన వారు http: apjgbv.apcfss.in వెబ్‌సైట్‌లో అప్లికేషన్ వివరాలు పొందవచ్చని తెలిపారు.

పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి-సోమల: మండలంలోని 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీ శీలం వారి పల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సర్వ శిక్ష అభియాన్ జిల్లా ఏఎల్ఎస్ఓ అజయ్ కుమార్ రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు రికార్డులను, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. అలాగే మండలంలోని పలు పాఠశాలల రికార్డులను పరిశీలించారు.

దివ్యాంగులకు అవగాహన



ప్రజాశక్తి-పుంగనూరు: ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగులకు అవగాహన సదస్సును స్థానిక జడ్పీ గర్ల్స్ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిరుపతికి చెందిన రాస్ కాలేజీలో స్పెషల్ బీఈడీ చేస్తున్న విద్యార్థులు, మూడవ సెమిస్టర్‌లో భాగంగా పుంగనూరు జడ్పీ గర్ల్స్ హైస్కూల్‌లో ఏర్పాటు చేశారు. స్పెషల్ బీఈడీ విద్యను అభ్యసిస్తున్న అనురాధ, సారిక, కుసుమ మాట్లాడుతూ దివ్యాంగుల పుట్టుకకు కారణాలు, నివారణ చర్యలు, దివ్యాంగుల చట్టాలు, విజయ గాథలు, దివ్యాంగుల యొక్క ప్రత్యేక సంస్థల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బీఈడీ విద్యార్థులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయ బందం, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

నియామకం

ప్రజాశక్తి-శ్రీరంగరాజపురం: మండల తహశీల్దారుగా శుక్రవారం లోకనాథ పిళ్లై బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన తహశీల్దార్ షబ్బీర్ భాష లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిపోవడంతో, ఇక్కడే డీటీగా పనిచేస్తున్న లోకనాథపిళ్లై జిల్లా అధికారుల సూచన మేరకు తహశీల్దారుగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పనిచేసి, ప్రజలకు న్యాయం చేస్తానని తెలిపారు.

పందుల సంచారంపై కఠిన చర్యలు

ప్రజాశక్తి-నగరి: పట్టణ పరిధిలో ఎక్కడ బడితే అక్కడ తిరుగుతున్న పందుల సమస్య పరిష్కారానికి అధికారులు ఇప్పటికే పలుమార్లు పందుల పెంపకం దార్లకు హెచ్చరికలు జారీ చేయడం, ఆమేరకు రెండు మార్లు పందులు పట్టి దూరంగా తరలించడం జరిగింది. ఆపై పందుల పెంపకం దార్ల అభ్యర్థనల మేరకు పందులను పట్టి దూరంగా వదిలిపెట్టే కార్యక్రమానికి అధికారులు విరామమిచ్చారు. అయితే అధికారులు ఇచ్చిన అవకాశాన్ని అలక్ష్యం చేస్తూ పందుల పెంపకం దారులు వర్షాలు పడే సమయంలో విచ్చలవిడిగా పందులను వదిలిపెట్టేశారు. దీంతో మళ్లీ స్థానికుల నుంచి ఫిర్యాదులు అందడంతో శుక్రవారం పందుల పెంపకం దార్లను మున్సిపల్ కార్యాలయం వద్దకు రప్పించిన మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి వారిని గట్టిగా హెచ్చరించారు. ఈ నెల 30వ తేదీ వరకు చివరిగడువని ఆపై ఉపేక్షించేది లేదని నివాసిత ప్రాంతాల్లో సంచరించే పందులను పట్టి దూరపు ప్రాంతాల్లో వదలివేయడం జరుగుతుందన్నారు. పెంపకం దార్ల ఆర్థిక నష్టానికి పురపాలకసంఘము వారు బాధ్యులు కారని సూచించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్ : నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలని నగర కమిషనర్ డా. జె అరుణ ఇంజినీరింగ్ విభాగం అధికారులు, గుత్తేదారులను ఆదేశించారు. శుక్రవారం నగరపాలక కార్యా లయంలో ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న అభివద్ధి పనులపై ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత గుత్తేదారులతో సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా "గడప గడపకు మన ప్రభుత్వం" కార్యక్రమంలో భాగంగా మంజూరు చేసిన, ఇప్పటికే ప్రారంభమైన పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. బీటీ రోడ్లు, సిమెంట్ రోడ్లు, కల్వర్టర్లు, డ్రైనేజీ పనులు వేగవంతం చేయాలని, టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులు సంబంధిత పనులను త్వరగా ప్రారంభించాలన్నారు. నగరంలో గాంధీ కూడలి, ఇతర ప్రధాన కూడళ్లలో మరింత మెరుగైన లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. ఆర్ఓ ప్లాంట్ల మరమ్మత్తు పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంఈ ధనలక్ష్మీ, డీఈలు రమణ, వెంకట ప్రసాద్, ఏఈలు, గుత్తేదారులు పాల్గొన్నారు.

స్నానపు గదుల నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-పలమనేరు: స్థానిక మొరంకు చెందిన పెంట గ్రామం వద్ద నిర్మితమైన శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో భక్తుల సౌకర్యార్థమై స్నానపు గదుల నిర్మాణానికి దాత వేణు గోపాల్ సహకారంతో పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రూ.10,116ల విరాళాన్ని దేవస్థానానికి అందజేశారు. పరిరక్షణ సమితి కార్యదర్శి నరసింహులు, కార్యవర్గ సభ్యులు దవనముని పొన్ముడి, సన్నీరాజు, దేవరాజులు, విజయ్ కుమార్, దేవాలయ ధర్మకర్తలు ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఘనంగా లక్ష కుంకుమార్చన

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: భక్తుల కోరికలు నెరవేర్చే అమ్మ పార్వతమ్మని ఆలయ నిర్వాహకులు శివ అన్నారు. శుక్రవారం మండలంలోని మొగిలి వారి పల్లి గ్రామ సమీపంలో గుండాల పార్వతీ సమేత పరమేశ్వర స్వామి ఆలయంలో లక్ష కుంకుమార్చన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు శివ మాట్లాడుతూ ఉగాది తర్వాత తొలి శుక్రవారం శివాలయంలో కుంకుమార్చన, పార్వతీ సమేత పరమేశ్వరునికి పంచామత అభిషేకం, భక్తులకు రూపాయి నాణేల పంపిణీ చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దళిత ద్రోహి చిట్టిబాబే..!

ప్రజాశక్తి-వెదురుకుప్పం: దళిత ద్రోహి, మోసకారి, దగా కోరు ముమ్మాటికీ తెలుగుదేశం పార్టీ జీడీ నెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త భీమనేని చిట్టిబాబే అని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బట్టే సుబ్రహ్మణ్యం విమర్శించారు. శుక్రవారం వెదురు కుప్పంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అహర్నిశలు జీడీ నెల్లూరు నియోజకవర్గ అభివద్ధికి కషి చేస్తున్న డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామిని విమర్శించే అర్హత చిట్టి బాబుకు లేదన్నారు. చిట్టిబాబు దళితుల పట్ల వివక్ష చూపుతున్న విషయాన్ని ఆ పార్టీ నేతలే విమర్శిస్తున్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు.

ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదు



ప్రజాశక్తి-రామకుప్పం: అధికార వైసిపి నాయకుల ప్రోద్బలంతో పోలీసులు ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని ... టిడిపి గెలుపును ఎవరూ ఆపలేరని చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ విజయోత్సవ ర్యాలీపై పోలీసులు టిడిపి నేతలపై కేసులు నమోదు చేశారు. శుక్రవారం 41 ఎ నోటీసులు ఇవ్వడంతో 16 మంది నేతలు, కార్యకర్తలు స్టేషన్ బెయిల్ కోసం హాజరయ్యారు. అధికారం అడ్డం పెట్టుకొని వైసీపీ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి, మండల అధ్యక్షులు ఆనంద రెడ్డి, కార్యదర్శి నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజనేయ రెడ్డి, నేతలు రామ్మూర్తి, విజయకుమార్ రెడ్డి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ద్వారా మిగిలిన గ్రామాల్లో పర్యటించాలని టిడిపి పంచాయతీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, యూనిట్ ఇన్‌ఛార్జులకు చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్ మండలాధ్యక్షుడు ఆనంద రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి సూచించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ముఖ్య నేతలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పంచాయతీల్లో కార్యకర్తలను కలుపుకొని ప్రతి ఇంట వైసిపి వ్యతిరేక విధానాలను ప్రచారం చేయాలని కోరారు. పార్టీ కార్యదర్శి నరసింహులు, యూనిట్ ఇన్‌ఛార్జులు గంట్లప్ప గౌడు, వెంకటరమణ, విశ్వనాథ్, విజయకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.